# పెరుగుతున్న ఉద్యాన పంటల సాగు

- విస్తారంగా సాగైన టమోట, చామంతి
- సాగులో అధికమవుతున్న పెట్టుబడులు
- సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు

**వేముల :** పులివెందుల నియోజకవర్గంలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ప్రతి ఏడాది ఒకే రకమైన పంటలు సాగు చేయడంవలన పెట్టుబడులు పెడుతున్న దిగుబడులు అందడంలేదు. దీంతో రైతులు పంటల సాగులో నష్టాలను చవి చూస్తున్నారు. అంతేకాక వ్యవసాయ పంటలైన వేరుశనగ, మినుము, శనగ, కొర్ర తదితర పంటలు సాగు చేసినా ఆశించిన మేర ఆదాయం అందడంలేదు. వ్యవసాయంలో పంటలు సాగు చేసి కష్టపడుతున్నా రైతులకు నిరాశే మిగులుతోంది. పంటల సాగులో పెట్టుబడులు పెరుగుతున్నాయే తప్ప ఆశించిన మేర దిగుబడులు రావడంలేదు. దీంతో రైతులు ఉద్యాన పంటల సాగుకు మొగ్గు చూపుతున్నారు.

**విస్తారంగా టమోట, చామంతి సాగు..**

పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా చామంతి, టమోట పంటలను విస్తారంగా సాగు చేశారు. నియోజకవర్గంలో 1000 ఎకరాలలో చామంతి,



వి.కొత్తపల్లె వద్ద సాగులో ఉన్న చామంతి

3250 ఎకరాలలో టమోట పంటలను సాగు చేసినట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. ఉద్యాన పంటల సాగులో ఆదాయం ఉంటుందనే ఉద్దేశ్యంతోనే సాగుకు ఆసక్తి చూపుతున్నామని రైతులు అంటున్నారు. వ్యవసాయ పంటలలో ఆశించిన మేర ఆదాయం రావడంలేదు. అదే ఉద్యాన పంటల సాగులో ధరలు ఉన్నట్లయితే ఆదాయం ఉంటోందని రైతులు అంటున్నారు. ఇప్పటికే చామంతి తోటలలో దిగుబడులు అందుతుండగా, టమోట



వేముల వద్ద సాగు చేసిన టమోట

తోటలలో దిగుబడులు రానున్నాయి. కొన్ని తోటలలో టమోటలు కోతకు వస్తున్నాయి.

**సాగులో పెరుగుతున్న పెట్టుబడులు..**

ఉద్యాన పంటల సాగులో పెట్టుబడులు భారీగా అవుతున్నాయి. చామంతి, టమోట సాగులో ఎకరాకు రూ.50వేలకు పైనే పెట్టుబడులు అవుతున్నాయని రైతులు అంటున్నారు. పంటల సాగు మొదలు దిగుబడులు కోతకు వచ్చేవరకు పెట్టుబడులు అవుతున్నాయి. చామంతి, టమోట మొక్కలను డిమాండ్‌ను బట్టి ఒక మొక్క రూపాయితో కొనుగోలు చేసి నాటుకున్నారు.

**సాగుపై రైతుల ఆసక్తి :**

ఉద్యాన పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపారు. టమోట, చామంతి పంటలను సాగు చేశారు. టమోట, చామంతి పంటలను సాగు చేశారు. ఉద్యాన పంటల సాగులో ఆదాయం ఉంటుంది. ఎకరాకు చామంతి తోటలలో 4నుంచి 5టన్నుల మేర దిగుబడులు అందుతున్నాయి. అలాగే టమోటలో ఆశించిన మేర దిగుబడులు అందుతున్నాయి. ప్రస్తుతం ఉద్యాన పంటల మార్కెట్ ధరలు స్థిరంగా ఉన్నాయి. చామంతి కిలో రూ.80ల నుంచి రూ.100లు, టమోట కిలో రూ.40ల నుంచి రూ.50ల మేర ధరలు ఉన్నాయి. మార్కెట్‌లో ధరలు ఉండటంతో ఆదాయం ఉంటోందని రైతులు అంటున్నారు.

**2ఎకరాలలో చామంతి సాగు చేశా..**



నాకున్న 2ఎకరాలలో చామంతి సాగు చేశా. ఎకరాకు రూ.50వేలకుపైనే పెట్టుబడులు పెట్టా. మరో నెల రోజులలో దిగుబడులు వస్తాయి. మార్కెట్‌లో ధరలు ఉంటే ఆదాయం ఉంటుంది. సరఫరా ఎక్కువగా డిమాండ్ తగ్గితే సాగులో ఆదాయం తగ్గుతుంది. స్థిరంగా ధరలు ఉంటే ఆదాయం ఉంటుందని ఆశిస్తున్నా.

– రాజారెడ్డి,చామంతి రైతు, గొందిపల్లె

**సాగులో లక్షకుపైనే పెట్టుబడులు పెట్టా..**



టమోట సాగులో లక్షకు పైనే పెట్టుబడులు పెట్టా. నాకున్న 2 ఎకరాలలో టమోట సాగు చేశా. పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నా. సకాలంలో నీటి తడులు ఇస్తూ తెగుళ్ల సోకకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నా. తోటలలో దిగుబడులు వచ్చే సమయానికి మార్కెట్‌లో ధరలు స్థిరంగా ఉంటే ఆదాయం ఉంటుంది.

– గంగాధర,టమోట రైతు, వేముల

## ఘనంగా బర్సీ మహోత్సవం



ఊరేగింపులో పాల్గొన్న పీఠాధిపతి, సోదరులు

**కమలాపురం :** పట్టణంలో వెలసిన దర్గా–ఏ–గఫారియాలో శ్రీ హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి బర్సీ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం దర్గా పీఠాధిపతి, సజ్జాదే నషీన్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో అశేష భక్త జన సందోహం నడుమ బర్సీ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పాత బస్టాండు సమీపంలోని గంధం ఇంటి నంచి ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో గంధంను ఊరేగింపుగా దర్గాకు తీసుకు వచ్చారు. బాణా సంచా పేల్చుతూ, డప్పు వాయిద్యాల నడుమ జరిగిన ఊరేగింపులో యువకులు వివిధ రకాల నృత్యాలు చేశారు. ఊరేగింపు దర్గా చేరుకున్న అనంతరం భక్తులు పీఠాధిపతి ఆధ్వర్యంలో స్వామి వారి మజార్లపై పూల చాదర్ సమర్పించి, గంధం ఎక్కించారు. ప్రత్యేక ఫాతెహ నిర్వహించారు. అనంతరం పీఠాధిపతి భక్తులందరికి గంధం పంపిణీ చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఠాధిపతి సోదరులు, మతపెద్దలు భక్తులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పీహెచ్‌సీ సందర్శన



వైద్య సేవలు పొందుతున్న వ్యక్తితో మాట్లాడుతున్న రవిబాబు

**వల్లూరు :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఎయిడ్స్, టీబీ, లెప్రసీ నియంత్రణాధికారి డాక్టర్ రవిబాబు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్‌సీడీ సర్వే, మలేరియా, డెంగీ లార్వా సర్వే, టీబీ లెప్రసీ సర్వేల గురించి సమీక్ష నిర్వహించారు. సర్వేలను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. పీహెచ్‌సీలో జరుగుతున్న కాన్పులను గురించి, ల్యాబ్‌లో అందుబాటులో వున్న పరీక్షలను గురించి ఆరా తీశారు. అనంతరం వార్డు, ల్యాబ్ రూములను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో వుండాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఫణీంద్ర, సీహెచ్‌వో వేణుగోపాల్‌రావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

### రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయండి

**వల్లూరు (చెన్నూరు) :** మండలంలో ఈనెల 6 నుంచి జరిగే రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని తహసీల్దార్ సరస్వతి కోరారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు, రెవెన్యూ వివాదాలు అన్నింటికీ పరిష్కార మార్గం చూపడానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి ఇంటికి వీఆర్వో, ఆర్‌ఐ, తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది రికార్డులతో వచ్చి మీకు సంబంధించిన వివరాలను తెలియజేస్తారన్నారు. వాటిని పరిశీలించి, ఏవైనా మార్పులుంటే వాటిని విచారణ చేసి సరి చేస్తారన్నారు. రెవెన్యూ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలన్నారు.

### వర్షంతో దెబ్బతిన్న వరి పంట



దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

**జమ్మలమడుగు :** ఇటీవల కురిసిన వర్షానికి ధర్మాపురం, గొరిగేనూరు, దేవగుడి, గూడెంచెరువు గ్రామాలలో సాగుచేసిన వరిపంటలో ఎక్కువగా నీరు పారడంతో పంట దెబ్బతింది. దాదాపు 500 ఎకరాల్లో వరి పంటను సాగు చేశారు. గురువారం వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి దెబ్బతిన్న పంటలను పరిశీలించి మాట్లాడారు. రైతులు సాగుచేసిన వరి పంట దెబ్బతిందని దీని వివరాల పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

### దివ్యాంగ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

**వేంపల్లె :** దివ్యాంగ విద్యార్థులు మనోధైర్యంతో అన్ని రంగాల్లో రాణించాలని సమగ్ర శిక్ష అసిస్టెంట్ కో ఆర్డినేటర్ రమణమూర్తి తెలిపారు. 65వ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం కడప నగరంలోని ఇండోర్ స్టేడియంలో ఏడి కృష్ణ కిశోర్ అధ్యక్షతన క్రీడా పోటీలు నిర్వహించారు. పోటీల్లో వేంపల్లె భవిత దివ్యాంగుల కేంద్రం తరపున రాజ్ కుమార్, చందు, విష్ణు, హర్షవర్ధన్, వెంకటతేజ, రవళి, సిద్దిక్ అనే విద్యార్థులు ప్రతిభ చూపడంతో వారికి ఏడీ కృష్ణకిశోర్ బహుమతులు అందజేశారు.

### పరామర్శ



కౌన్సిలర్ తుంగ వెంకట్రామిరెడ్డిని పరామర్శిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

**ఎర్రగుంట్ల :** ఇటీవల ఆరోగ్యం బాగలేక ఆపరేషన్ చేయించుకున్న స్థానిక 5వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ తుంగ వెంకట్రామిరెడ్డిని గురువారం ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డిలు పరామర్శించి విశ్రాంతి తీసుకోవాలని తెలిపారు. కలిసినవారిలో కౌన్సిలర్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జయరామకృష్ణారెడ్డిలు ఉన్నారు.

### అయ్యప్ప స్వాముల పాదయాత్రకు సంఘీభావం

**పులివెందుల రూరల్ :** పులివెందుల నుంచి శబరిమలైకు పాదయాత్రగా వెలుతున్న అయ్యప్ప స్వాములకు కదిరి నియోజకవర్గం నల్లచెరువు గ్రామ సమీపంలో గురువారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అంబకపల్లె శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిల బృందానికి సంఘీభావం తెలిపారు. పాదయాత్రను విజయవంతంగా ముగించుకుని రావాలన్నారు.

### నేడు అంబేడ్కర్ వర్ధంతి

**పులివెందుల రూరల్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించే కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్‌సీపీ వర్గాలు తెలిపాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తప్పక పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

## నేలకొరిగిన పంటలు

**పెద్దముడియం :** తుఫాన్ ప్రభావంతో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి మండలంలో సాగు చేసిన వరి, జొన్న పంటలు నేలకొరిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట పడిపోవటం వలన పంట దిగుబడి తగ్గిపోవటంతో పాటు నూర్పిళ్ల ఖర్చు తగ్గుతాయని చెబుతున్నారు. జొన్న పంటను మండల వ్యాప్తంగా దాదపు 1000 ఎకరాలలో సాగు చేయగా కుందూ పరీవాహక గ్రామాలైన నెమళ్లదిన్నె, చిన్నముడియం, గరిశలూరు, బలపనగూడూరు గ్రామాల రైతులు దాదాపు 500 ఎకరాలలో వరి పంటను



పెద్దపసుపుల గ్రామ సమీపంలో పడిపోయిన జొన్న పంట

సాగు చేశారు. వర్షం ఇలాగే పడుతూ వచ్చే అరకొర పంట దిగుబడి మొత్తం కుళ్లిపోయే దానికి ఆవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

## లఘు చిత్రం ప్రారంభం

**వీరపునాయమునిపల్లె :** స్థానిక సంగమేశ్వర పాఠశాలలో ఎస్.ఆర్.ఎస్ క్రియేషెన్స్ వారు చిత్రీకరిస్తున్న బాల్య వివాహాలు రద్దు లఘు చిత్రాన్ని గురువారం ఎమ్మెల్యే పుత్తా చైతన్యకుమార్‌రెడ్డి క్లాప్ కొట్టి ప్రారంభించి మాట్లాడారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం చట్టరిత్యా నేరమన్నారు. గ్రామాల్లో తక్కువ వయస్సులో వివాహాలు జరిపిస్తుంటే వెంటనే స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసులు, ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. మండల విద్యాశాఖ అధికారి జాఫర్ సాధిక్, సంగమేశ్వర విద్యా సంస్థల అధినేత వెంకటసుబ్బానాయుడు, ప్రధానోపాధ్యాయురాలు పాల్గొన్నారు.

## వధూవరులకు ఆశీర్వాదం

**చింతకొమ్మదిన్నె :** మండలంలోని మాధవి కన్వెన్షన్‌లో గురువారం ఊటుకూరు గ్రామానికి చెందిన వ్యాపారవేత్త చీమల శివరామిరెడ్డి కు మారుడు శివకుమార్‌రెడ్డికి బయనపల్లి గ్రామా నికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు శ్రీనివాసులురెడ్డి కుమార్తె భావనరెడ్డితో జరిగిన వివాహ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లి మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వధూవరులను ఆశీర్వదించారు.



వధూవరులతో వైఎస్సార్‌సీపీ నాయకులు

## ప్రభుత్వానికి చెంపపెట్టు

**పులివెందుల రూరల్ :** రాష్ట్ర ప్రభుత్వం సాగునీటి ఎన్నికలను ఏకపక్షంగా నిర్వహించేందుకు చేస్తున్న ప్రయత్నాలను హైకోర్టు తీర్పుతో చెంపపెట్టుగా మారిందని వైఎస్సార్‌సీపీ నూర్‌బాషా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ సాహెబ్ తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక దూదేకుల సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సాగునీటి ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం బహిరంగంగా చేతులెత్తి అభ్యర్థులను ఎన్నుకొనేలా నిబంధన పెట్టిందన్నారు. చేతులెత్తే పద్ధతి కాకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరపాలని వైఎస్సార్‌సీపీ హైకోర్టును ఆశ్రయించిందన్నారు. దీంతో హైకోర్టు సాగునీటి ఎన్నికలను వచ్చే ఏడాది ఫిబ్రవరి 25వ తేదీలోపు వాదనలు వినిపించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరింది. సాగునీటి ఎన్నికలను మూస ధోరణిలో నిర్వహించాలని హైకోర్టు ఎన్నికల సంఘానికి తెలిపింది. ఈ తీర్పు ప్రభుత్వ నిబంధనకు చెంపపెట్టుగా మారిందన్నారు.

## గ్రామ సచివాలయాల తనిఖీ

**ఎర్రగుంట్ల :** మండల పరిధిలోని పోట్లదుర్తి, కలమల్ల గ్రామాలలోని గ్రామ సచివాలయాలను ఎంపీడీఓ వెంకటరమణయ్య గురువారం తనిఖీ చేసి ఉద్యోగుల బయోమెట్రిక్‌ను, హౌసింగ్ జియోట్యాగింగ్‌ను పరిశీలించారు. ప్రజా సమస్యలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**వేముల :** వేల్పుల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని యూసీఐఎల్ ఫీడర్, బెస్తవారిపల్లె ఫీడర్, భ్రమరాంబ ఫీడర్‌లలో శుక్రవారం ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, రైతులు గమనించి సహకరించాలన్నారు.

## విద్యుత్ ప్రమాదంలో గేదె మృతి



**చక్రాయపేట :** మండలంలోని గంగారపువాండ్లపల్లెకు చెందిన కె.ఎస్.శ్రీనివాసులరెడ్డికి చెందిన గేదె విద్యుత్ ప్రమాదంలో మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. గురువారం గేదెలన్ని గ్రామ సమీపంలోని బుగ్గబాయి వద్ద ఉన్న గుట్టకు మేతకు వెళ్లాయన్నారు. అక్కడ 11 కేవీ విద్యుత్తు లైన్ గేదెపై తెగిపడటంతో గేదె మృతి చెందిందన్నారు. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ అధికారులతోపాటు సురభి పశువైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు.

# గురువులకు రక్షణ కల్పించాలి

**పులివెందుల రూరల్ :** గురువులకు రక్షణ కరువైందని రక్షణ కల్పించాలని గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, రమణప్పసత్రం పాఠశాలల్లో ఉపాధ్యాయుడు ఎజాజ్ అహమ్మద్ మృతి పై ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెడ్మాస్టర్ బండి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ఎజాజ్‌పై తరగతి గదిలో విద్యార్థులు దాడిచేయడం ఆందోళనలకు గురిచేసిందన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**పెండ్లిమర్రి :** రాయచోటిలోని కొత్తపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్ పనిచేస్తున్న ఉపాధ్యాయుడి మృతిపై గురువారం ఎగువపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆర్జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు గునిసెట్టి శ్రీనువాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డిల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఆర్.యూ.పి.పి జిల్లా అధ్యక్షులు ఖాదర్ ఉపాధ్యాయులు సలీం, కొండయ్య, కేశవు లు, భారతి, పుష్పలత, శ్రీనువాసులు, రవి పాల్గొన్నారు.

**చింతకొమ్మదిన్నె :** రాయచోటిలోని కొత్తపల్లె ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు ఎజాజ్ అహ్మద్ మృతిపై మండల ఉపాధ్యాయులు గురువారం భోజన విరామ సమయంలో తమ నిరసన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు వి.వెంకట్రామిరెడ్డి, బి.రమాదేవి, పీఆర్‌టీయూ రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**వల్లూరు (చెన్నూరు) :** రాయచోటిలో పనిచేస్తున్న



పులివెందులలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎజాజ్ అహ్మద్ మృతిపై సమగ్ర విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుని మృతిపై చెన్నూరు మండల విద్యాశాఖాధి కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజ, అపస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఎస్టీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**వేంపల్లె :** రాయచోటి పట్టణంలోని కొత్తపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఇజాజ్ అహమ్మద్ మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షుడు బీఎస్ రమణారెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇజాజ్ అహ్మద్ గుండెపోటుతో మరణించాడని హెడ్మాస్టర్ చెబుతుండగా, మృతుని భార్య తన భర్తను విద్యార్థులు దాడి చేసి చంపేశారని ప్రకటించడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు.

# బీమా ప్రీమియం చెల్లింపునకు ఇక్కట్లు

**కమలాపురం :** మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు పంటల బీమా చెల్లించేందుకు ఇంటర్‌నెట్ సెంటర్లకు వెళ్తే నిరాశే ఎదురవుతోంది. బీమా ప్రీమియం చెల్లించాల్సిన సైట్‌లో అసలు కొన్ని సర్వే నెంబర్లు పూర్తిగా కనిపించడం లేదు. చిన్నచెప్పలి, సి.గోపులాపురం, చదిపిరాళ్ల, పాచికలపాడు తదితర గ్రామాలకు చెందిన రైతులు తాము సాగు చేసిన పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలని మీ సేవ కేంద్రాలు, నెట్ సెంటర్లకు వెళ్లారు. అసలు కొన్ని గ్రామాలు, కొన్ని సర్వే నెంబర్లు సైట్‌లో చూపించడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. భూ రీ సర్వే చేయని గ్రామాలు కనిపించడం లేదని, ఇది రెవెన్యూ అధికారులు చూడాల్సిన అంశం అని వ్యవసాయాధి కారులు అంటున్నారని రైతులు పీరా సాహెబ్, సుబ్బారెడ్డి, రామక్రిష్ణ తదితర అంటున్నారు.

రెవెన్యూ అధికారుల వద్దకు వెళితే దీనికి తమకు సంబంధం లేదని అంటున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీమా చెల్లింపుల గడువు పూర్తి అయితే తమ పరిస్థితి ఏంటని రైతులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై ఏడీఏ నరసింహారెడ్డిని వివరణ కోరగా బీమా ప్రీమియం చెల్లించేందుకు కొన్ని సర్వే నెంబర్లు చూపించని మాట వాస్తవమేనన్నారు. అయితే ఇ–క్రాప్ బుకింగ్ చేసే సమయంలో అన్ని సర్వే నెంబర్లు కనిపిస్తున్నాయని ఆయన వివరించారు. ఈ సమస్య వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, శనివారం సాయంత్రంలోపు సమస్య పరిష్కారం అవుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏడీఏ వివరించారు.

**సింహాద్రిపురంలో**

**సింహాద్రిపురం :** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతులు వేసిన పంటలకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి ఇన్సూరెన్స్ డబ్బులు రైతుల ఖాతాలో జమ అయ్యేటట్లు చేసింది. కానీ టీడీపీ కూటమి ప్రభుత్వం రైతులు వేసిన పంటలకు రైతులే ప్రీమియం చెల్లించాలనడంతో రైతులు పంటలకు క్రాప్ ఇన్సూరెన్స్ చేయుటకు బ్యాంకులకు, మీసేవ కేంద్రాలకు దారి పట్టారు. ప్రీమియం ఈనెల 15 చివరి తేదీ కావడంతో సైట్లు పనిచేయక రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు తేదీని పొడిగించి సైట్ సమస్య లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

# లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని వినతి

**పులివెందుల రూరల్ :** యువగళంలో నారా లోకేష్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ శాఖ సొసైటీ గురుకుల పాఠశాలల్లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1600 మంది పనిచేస్తున్నామన్నారు. గతంలో యువగళం పాదయాత్ర చేపట్టిన నారా లోకేష్‌ను కలిసి వారి సమస్యలను విన్నవించామన్నారు. పార్ట్ టైం టీచర్స్ యొక్క ఉద్యోగ భద్రత జీతాలు పెంపుదలపై పాదయాత్రలో లోకేష్ ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చే విధంగా చూడాలని వారు ఎమ్మెల్సీని కోరారు. మీ సమస్యను పరిష్కరించే విధంగా నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే హామీని నెరవేరుస్తామని ఎమ్మెల్సీ భరోసా ఇచ్చారు.

# ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని నిరసన

**జమ్మలమడుగు :** విభజన చట్టం హామీలో భాగంగా కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని గురువారం స్థానిక పాత బస్టాండ్‌లోని గాంధీ విగ్రహం వద్ద ఉక్కు సాధన కమిటీ నిరసన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాలను విభజన చేసే సమయంలో నాడు కేంద్రంలో ఉన్న ప్రభుత్వాలు ఏపీకి పది సంవత్సరాల పాటు ప్రత్యేక హోదాతోపాటు కడపలో స్టీల్‌ప్లాంట్, వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక ప్యాకేజి ఇస్తామని ప్రకటించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉక్కు సాధన కమిటీ

తీసుకుని వచ్చి ఉక్కు సాధన కోసం ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

**కమలాపురం :** మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల రెవెన్యూ అధికారి శివరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సదస్సులు నిర్వహిస్తామని, రెవెన్యూ సమస్యలు ఉన్న వారు ఈ సదస్సులకు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. కాగా 6వ తేదీన పాచికలపాడు, 9న చిన్నచెప్పలి, 10న అప్పారావుపల్లె, 11న జంభాపురం, 12న తురకపల్లె, 13న గంగవరం, విభరాపురం, 17న సంబటూరు, 18న నల్లింగాయపల్లె, 19న గొల్లపల్లె, 20న టి.చదిపిరాళ్ల, రామచంద్రాపురం, 21న దాదిరెడ్డిపల్లె, 24న ఎర్రగుడిపాడు, 26న కోగటం, 27న లేటపల్లె, 28న ఎల్లారెడ్డిపల్లె, వంకమాడ, 30న పెద్దచెప్పలి, జనవరి 2వ తేదీన పందిళ్లపల్లె, 3న పొడదుర్తి, 4న మీరాపురం, 7న సి.గోపులాపురం, 8న కమలాపురం లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని, సమస్యలున్న వారు సదస్సులకు వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ తెలిపారు.

**వల్లూరులో..**

**వల్లూరు :** మండలంలో శుక్రవారం నుండి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీవాణి ఒక ప్రకటనలో తెలిపారు. నిర్దేశిత గ్రామాల్లో ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ సదస్సులు జరుగుతాయన్నారు. 6న అంబవరం, 9న ఇసుకపల్లె, 10న ఓబన సోమయాజులపల్లె, 11న కోట్లూరు, 12న కోదండ రామాపురం, 13న కొప్పోలు, 16న కుమారునిపల్లె, 17న గోటూరు, 18న చిన్నపుత్త, 19న జంగంపల్లె, 20న తప్పెట్ల, 21న తోల్లగంగనపల్లె, 23న పెద్దపుత్త, 24న పైడికాలువ, 26న పుత్తచిన్నాయపల్లె, 27న యాదవాపురం, 28న వల్లూరు, 30న లేబాక, 31న వెంకటేశాపురం, జనవరి 2న అంకాయపల్లె గ్రామాల్లో సదస్సులు జరుగుతాయని తెలిపారు.

**పెండ్లిమర్రిలో..**

**పెండ్లిమర్రి :** మండలంలో శుక్రవారం నుంచి జనవరి 7 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అనురాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తిప్పిరెడ్డిపల్లె, 9 కొత్తగిరియంపల్లె, 10న పెండ్లిమర్రి, 11న చాబలి, బిందురావుపల్లె, 12న ఎస్.రామాపురం, కొత్తపేట, 13న గంగనపల్లె, 16న తుమ్మలూరు, 17న కొండూరు, 18న నందిమండలం, 19న నందిమండలం, ఏ.వి.కాల్వ, 20న మాచునూరు, 21న వెల్లటూరు, 23న గొందిపల్లె, 24న చీమలపెంట, 27న మొయిళ్లకాల్వ, 28న రంపతాడు, 30న సంగటిపల్లె, 31న పగడాలపల్లె, జనవరి 2న కోనాయపల్లె, 3న పెద్దదాసరిపల్లె, 4న చిన్నదాసరిపల్లె, 6న చెన్నంరాజుపల్లె, ఏ.రామచంద్రాపురం, 7న ఎగువపల్లెలో సదస్సులు జరుగుతాయన్నారు.

**లింగాలలో..**

**లింగాల :** మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఈశ్వరయ్య ఒక ప్రకటన లో తెలిపారు. శుక్రవారం ఉదయం దొండ్లవాగు గ్రామంలో జరుగుతుందన్నారు. ఈ సమావేశాలకు అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. 10న వెలిదండ్ల, 11న లోపట్నూతల, 12న గుణకణపల్లె, 13న బోనాల, 17న చిన్నకుడాల, 18న కామసముద్రం, 19న మురారిచింతల, 20న అంబకపల్లె, 21న లింగాల, 26న కోమన్నూతల, 27న పెద్దకుడాల, 28, 31వ తేదీలలో ఇప్పట్ల, జనవరి 2న రామన్నూతలపల్లె, 3న ఇప్పట్ల, 8న పార్నపల్లె గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరుగుతాయన్నారు.

**పులివెందులలో..**

**పులివెందుల రూరల్ :** నేటి నుంచి మండలంలోని ఆరు పంచాయతీలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు పాల్గొని సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

**సింహాద్రిపురంలో..**

**సింహాద్రిపురం :** గ్రామీణ ప్రాంతాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తున్నామని తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం అగ్రహారం, 10న అంకాలమ్మ గూడూరు, 11న బలపనూరు, 12 బిదినంచర్ల, 13 గురిజాల ఇలా తేదీల వారీగా అన్ని రెవెన్యూ గ్రామాల్లో చెప్పిన తేదీలలో ఈ గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. ఆయా గ్రామ రైతులు ఈ గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.